# నమస్తే తెలంగాణ
# ఖమ్మం
5 | ఖమ్మం, గురువారం 27 ఫిబ్రవరి 2025 | KHAMMAM


- నేటి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేసిన అధికారులు
- ఖమ్మం జిల్లాలో 4,089 మంది, భద్రాద్రి జిల్లాలో 2,022 మంది ఉపాధ్యాయ ఓటర్లు
- ఉమ్మడి జిల్లాలో 47 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు
- డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి ఎన్నికల సామగ్రితో బయలుదేరిన అధికారులు, సిబ్బంది



నల్లగొండ-ఖమ్మం-వరంగల్ జిల్లాల పరిధిలో గురువారం జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే పోలింగ్ కోసం పోలింగ్ కేంద్రాల్లో పటిష్ట ఏర్పాట్లు చేశారు. ఖమ్మంలో కలెక్టరేట్‌లోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లిలో గల రామచంద్ర డిగ్రీ కళాశాలలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి సిబ్బంది ఎన్నికల సామగ్రితో తమకు కేటాయించిన కేంద్రాలకు బస్సుల్లో బయలుదేరి వెళ్లారు. ఖమ్మం జిల్లాలో 4,089 మంది ఉపాధ్యాయ ఓటర్ల కోసం 24 పోలింగ్ కేంద్రాలు, భద్రాద్రి జిల్లాలో 2,022 మంది ఓటర్ల కోసం 23 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే తమకు కేటాయించిన కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది గురువారం నాటి పోలింగ్ నిర్వహణ కోసం ఏర్పాట్లు చేసుకున్నారు.

# ఓటేయండి టీచర్..

## ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి



డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో అదనపు కలెక్టర్, డీఆర్‌వో, ఏవో



పోలింగ్ కేంద్రాలకు బస్సులో వెళ్తున్న ఎన్నికల సిబ్బంది





డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో బ్యాలెట్ బాక్సులు

ఖమ్మం, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఖమ్మం-నల్లగొండ-వరంగల్ ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల్లో ఖమ్మం జిల్లాలోని 21 మండలాల నుంచి మొత్తం 4,089 మంది ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. ఈ ఓటర్లలో పురుషులు 2,372, స్త్రీలు 1,717 మంది ఉన్నారు. వీరిలో ప్రాథమిక పాఠశాలలు తప్ప ఉన్నత పాఠశాలలతోపాటు ఉన్నత తరగతులకు బోధించే వారు ఓటుహక్కు కలిగి ఉన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లు, పీఈటీలు, ప్రధానోపాధ్యాయులు, జూనియర్ కళాశాలల్లో పనిచేసే అధ్యాపకులు, ప్రిన్సిపాల్స్, డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులు, ప్రిన్సిపాల్స్, ఇదే తరహాలో మోడల్ స్కూల్స్, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో పనిచేసే సీఆర్టీలు, స్పెషల్ ఆఫీసర్లు, యూనివర్సిటీ కళాశాలల్లోని ప్రొఫెసర్లు ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. ఈ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న వారిలో సైతం తమ సర్వీసులు మూడు సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారికి మాత్రమే ఓటుహక్కు కల్పించారు.



ఓటరు జాబితా, బ్యాలెట్ పత్రాలను సిద్ధం చేస్తున్న సిబ్బంది

### కలెక్టరేట్ కేంద్రంగా...

ఖమ్మం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరం కేంద్రంగా ఎన్నికలకు సంబంధించిన సామగ్రిని తరలించారు. జిల్లాలోని 24 పోలింగ్ కేంద్రాలకు అవసరమైన బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలు, ఇతర వస్తువులను అందజేశారు. సహాయ రిటర్నింగ్ అధికారి, డీఆర్‌వో ఏ.పద్మశ్రీ, ఏవో ఎస్.అరుణ ఆధ్వర్యంలో ఎన్నికల సామగ్రిని అందించారు. ప్రతి కేంద్రానికి కేటాయించిన పీవో, ఏపీవో, అదనంగా కేటాయించమబడిన పీవోలకు అందజేశారు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మండలాల వారీగా టేబుళ్లు కేటాయించి ఎన్నికలకు అవసరమైన వస్తువులను అందించారు. నిర్వహణకు అవసరమైన పెన్‌లు, సిరాను అందించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి తీసుకున్న సామగ్రిని సెక్టోరల్ అధికారులు పూర్తి భద్రత మధ్య ఆయా మండలాల్లోని కేంద్రాలకు తరలించారు. ప్రతి మూడు కేంద్రాలకు ఒక్కో సెక్టోరల్ అధికారిని రూట్ అధికారిగా నియమించారు. ఎన్నికలకు సంబంధించిన సామగ్రిని సిబ్బందికి అందజేసే ప్రక్రియను అదనపు కలెక్టర్ పిన్‌రెడ్డి శ్రీనివాసరెడ్డి బుధవారం పరిశీలించారు. పోలింగ్ విధులను సిబ్బంది పకడ్బందీగా చేపట్టాలన్నారు. పోలింగ్ కేంద్రంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్స్‌లను నిర్ణీత సమయంలో కేంద్రంలో అప్పగించాలని స్పష్టం చేశారు. రిసెప్షన్ పాయింట్‌కు చేరుకున్నాక వీటన్నింటినీ కౌంటింగ్ కేంద్రం నల్లగొండ జిల్లాకు తరలించనున్నారు.





### మైక్రో అబ్జర్వర్ల పర్యవేక్షణ...

కలెక్టరేట్ నుంచి మైక్రో అబ్జర్వర్లను నియమించారు. వీరు జరుగుతున్న ప్రక్రియను నిశితంగా పరిశీలించి అధికారులకు సమాచారం చేరవేస్తారు. 9 మంది సెక్టార్ అధికారులు, 28 మంది పీవోలు, 27 మంది ఏపీవోలు, 58 మంది ఇతర పోలింగ్ సిబ్బంది, 28మంది మైక్రో అబ్జర్వర్‌లు పనిచేస్తున్నారు. 8 రూట్లలో పోలింగ్ కేంద్రాలకు సామగ్రిని తరలిస్తున్నారు. వీటికోసం 8 ఆర్టీసీ బస్సులను సిద్ధం చేశారు.

కూసుమంచి శివాలయంలో పూజలు చేస్తున్న ఎంపీ వద్దిరాజు దంపతులు



## శంభో శంకర..

### ఉమ్మడి జిల్లాలో భక్తిశ్రద్ధలతో మహా శివరాత్రి వేడుకలు

మహా శివరాత్రి పర్వదిన వేడుకలను ఉమ్మడి జిల్లావ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శైవ క్షేత్రాల్లో బుధవారం తెల్లవారుజాము నుంచే భక్తులు 'శివ శివ శంకర భక్తవ శంకర', 'శంభో శంకర' అంటూ శివనామస్మరణ చేశారు. పరమ శివుడికి ప్రీతిపాత్రమైన రోజున అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి స్వామివారిని తీరొక్క పూలతో అలంకరించారు. శివయ్యను తలుస్తూ భక్తిభావంతో భక్తులు ఉపవాస దీక్షలు చేపట్టారు. పలు ఆలయాల్లో రాత్రివేళ శివపార్వతుల కల్యాణాన్ని నిర్వాహకులు కనుల పండువగా నిర్వహించగా.. భక్తజనం వీక్షించి పునీతులయ్యారు. పలువురు ప్రముఖులు ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. –నమస్తే తెలంగాణ నెట్‌వర్క్

## జనగామలో 10 నెలల పాప కిడ్నాప్

### కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు



పోలీసులు గాలిస్తున్న ఖమ్మం జిల్లాకు చెందిన నిందితులైన దంపతులు

జనగామ చౌరస్తా, ఫిబ్రవరి 26 : జనగామ జిల్లా కేంద్రంలో 10 నెలల పాప కిడ్నాప్ కలకలం సృష్టించింది. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అర్బన్ సీఐ దామోదర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారి 163కి సమీపంలో కొత్తగా నిర్మిస్తున్న పీఎల్‌జీ కన్వెన్షన్‌లో కొంతకాలంగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన రామ్ జూల్ రజాక్ తన భార్యతో కలిసి కూలీ పనిచేసుకుంటూ అక్కడే గుడిసెలు వేసుకొని నివసిస్తున్నారు. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. వీరి గుడిసె పక్కనే ఖమ్మం జిల్లాకు చెందిన సురేశ్, ప్రేమలత దంపతులు కూడా అక్కడే కూలీ పనిచేసుకుంటూ గుడిసె వేసుకొని ఉంటున్నారు. ఈ క్రమంలో ఇరు కుటుంబాల మధ్య పరిచయం ఏర్పడి, వారి పిల్లలను ఖమ్మం జిల్లాకు చెందిన దంపతులు బజారుకు తీసుకెళ్లేంత చనువు ఏర్పడింది. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం సురేశ్, ప్రేమలత దంపతులు బజారుకు వెళ్లి వస్తామని చెప్పి రామ్ జూల్ రజాక్ చిన్న కూతురు శివాని(10 నెలలు)ని బైక్‌పై తీసుకొని వెళ్లి తిరిగి రాలేదు. వారికి ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ అని వస్తున్నది. రాత్రి అయినా రాకపోవడంతో అనుమానం వచ్చిన బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై రాజేశ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుల ఆచూకీ తెలిసిన వారు జనగామ అర్బన్ సీఐ సెల్ నంబర్ 8712685202, ఎస్సై-1 సెల్ నంబర్ 8712685259, ఎస్సై-2 సెల్ నంబర్ 8712685260కు సమాచారం అందించాలని సీఐ కోరారు.

## బరిలో 19 మంది అభ్యర్థులు

ఉపాధ్యాయ నియోజకవర్గంలో మొత్తం 19 మంది అభ్యర్థులు రంగంలో ఉన్నారు. యూటీఎఫ్ నుంచి ప్రస్తుత ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, పీఆర్‌టీయూ-టీఎస్ నుంచి పింగిళి శ్రీపాల్‌రెడ్డి, బీజేపీ నుంచి పులి సర్వోత్తంరెడ్డి, బీసీ సంఘాల మద్దతుతో టీచర్స్ జాక్ నుంచి మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, పీసీసీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, కుడా మాజీ చైర్మన్ ఎస్.సుందర్‌రాజ్, ప్రజావాణి పార్టీ నుంచి లింగిడి వెంకటేశ్వర్లు, స్వతంత్ర అభ్యర్థులుగా అర్వ స్వాతి, కంటె సాయన్న, డాక్టర్ కొలిపాక వెంకటస్వామి, గోపాల్‌రెడ్డి పన్నాల, ఏలె చంద్రమోహన్, చాలిక చంద్రశేఖర్, జంగిటి కైలాసం, జె.శంకర్, తలకోల పురుషోత్తంరెడ్డి, తాటికొండ వెంకటరాజయ్య, దామెర బాబురావు, బంక రాజు అభ్యర్థులుగా పోటీ పడుతున్నారు. ఇందులో ప్రధాన సంఘాలకు చెందిన ఐదారుగురు గెలుపుపై ధీమాతో సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ప్రతి ఓటరును కలిసే ప్రయత్నం చేశారు. యూటీఎఫ్ మినహా మిగతా ప్రధాన అభ్యర్థులు ఓటర్లను ప్రలోభపెట్టేందుకు చివరి వరకు ప్రయత్నాలు కొనసాగించారు. ఒక్కో ఓటుకు రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు వెచ్చించినట్లు వెలుగులోకి వచ్చింది. ఇక మంగళ, బుధవారాల్లో మందువిందులు కూడా ఏర్పాటు చేశారు. వీటిపై యూటీఎఫ్ లాంటి సంఘాలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేశాయి. దీంతో ఈ ప్రలోభాల పర్వం గెలుపోటములను ఏ మేరకు ప్రభావితం చేస్తుందనేది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

## పకడ్బందీగా ఎన్నికల నిర్వహణ

### డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్



పోలింగ్ సిబ్బందికి ఎన్నికల నిర్వహణపై సలహాలు ఇస్తున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ) : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణను నిమయ నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఆదేశించారు. లక్ష్మీదేవిపల్లి మండల కేంద్రంలోని రామచంద్ర డిగ్రీ కాలేజీలో పోలింగ్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఎన్నికల సామగ్రిని పరిశీలించి, సిబ్బందికి కేటాయించిన విధులు, పోలింగ్ డైరీ, బాక్స్‌లు సీలింగ్ చేసే విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి జరిగే పోలింగ్ సరళిపై గంటగంటకూ సమాచారం ఇవ్వాలన్నారు. జిల్లా కేంద్రంలోని నాలుగు పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఎక్కువగా ఉన్నందున చివరి క్షణంలో ఓటర్లు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందన్నారు. పోలింగ్ సందర్భంగా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బస్సు అందుబాటులో ఉంటుందని, సాయంత్రం 4 గంటలకు పోలింగ్ ప్రక్రియ ముగియగానే పీవోలు, ఏపీవోలు బస్సులలో సామగ్రితో నల్లగొండలోని స్ట్రాంగ్ రూంల వరకు వెళ్లాలని, మీ వెంట పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది ఉంటారని తెలిపారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ వేణుగోపాల్, సీపీవో సంజీవరావు, ఆర్డీవో, తహసీల్దార్లు ఉన్నారు.



పోలింగ్ మెటీరియల్‌ను సిద్ధం చేసుకుంటున్న అధికారులు, సిబ్బంది

### జిల్లాలో 23 కేంద్రాల్లో పోలింగ్..

నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పరిధిలో గురువారం జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు జిల్లాలోని 23 కేంద్రాల్లో ఉదయం 8 గంటల నుంచి పోలింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ తెలిపారు. జిల్లాలో ఉపాధ్యాయ ఓటర్లు 2,022 మంది ఉండగా.. అందులో మహిళలు 954, పురుషులు 1,068 మంది ఉన్నట్లు తెలిపారు. ప్రతి మండలంలో ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి అన్ని సౌకర్యాలు కల్పించామని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 అమలులో ఉంటుందని, పీవోలు 28 మంది, ఏపీవోలు 28, వోపీలు 28, ఓపీఓలు 28 మందిని నియమించినట్లు తెలిపారు. ఎన్నికల సిబ్బంది కోసం ప్రతి మండలానికి ఒక బస్సు కేటాయించామన్నారు. ఓటింగ్ ప్రక్రియలో పాల్గొనే ఉపాధ్యాయులు ప్రాధాన్యతా క్రమంలో క్రమ సంఖ్య వేయాలని, పెన్నుతో టిక్ పెట్టకూడదని సూచించారు.

# పంటలు ఎండుతున్నయ్..!

- లోవోల్టేజి సమస్యతో కాలిపోతున్న మోటార్లు
- ఏడాదిగా అరిగోస పడుతున్న అన్నదాతలు
- చింతపల్లి రైతులకు ఏడాదిగా కరెంట్ తిప్పలు
- ఏమాత్రం పట్టించుకోని విద్యుత్ అధికారులు

**మా పంటలు ఎండిపోతున్నాయ్ సారో అని ఖమ్మంరూరల్ మండలం చింతపల్లి గ్రామ రైతులు మొత్తుకుంటున్నారు. వ్యవసాయ బావుల వద్ద లో వోల్టేజి సమస్యను పరిష్కరించండి మహాప్రభో అంటూ విద్యుత్ అధికారులను ప్రాధేయపడుతున్నారు. లోవోల్టేజి సమస్య వల్ల ప్రతిరోజూ ఇద్దరి, ముగ్గురి మోటార్లు కాలిపోతున్నాయని, దీంతో రూ.5 నుంచి రూ.6 వేల వరకు ఖర్చు అవుతున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక మోటార్‌ను బాగుచేయించే సరికి నాలుగు రోజులు పడుతుండడంతో పంటలు నిలువునా ఎండిపోతున్నాయని తమ గోసను వెలిబుచ్చుతున్నారు. విద్యుత్ అధికారులకు ఎంత మంది రైతులు మొరపెట్టుకున్నా ఏమాత్రం పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. కనీసం పెద్దసార్లు అయినా పట్టించుకొని తమ ప్రాంతంలో విద్యుత్ లోవోల్టేజి సమస్యను పరిష్కరించాలని చేతులెత్తి ప్రార్థిస్తున్నారు.**

**- ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 26**



ఎండిపోతున్న ఆకుకూరల తోట

ఖమ్మంరూరల్ మండలంలో వ్యవసాయ, ఉద్యాన పంటల సాగుకు చింతపల్లి గ్రామం పెట్టింది పేరు. గ్రామంలో అత్యధిక ప్రజలు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ప్రస్తుత యాసంగి సీజన్‌లో వరి, మక్క పంటలతోపాటు, కూరగాయలు, ఆకుకూరలు భారీగా సాగు చేస్తున్నారు. వరి, మక్క, ఉద్యాన పంటలు చేతికి వచ్చే దశలో ఉన్నాయి. ఈ తరుణంలో రైతులను లోవోల్టేజి కరెంట్ సమస్య తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నది. గ్రామంలోని పలు ట్రాన్స్‌ఫార్మర్ల పరిధిలో అత్యధికంగా కరెంటు మోటార్లు ఉండడంతో లో వోల్టేజి సమస్య ఉత్పన్నమవుతున్నది. ముఖ్యంగా ఆరెకోడు, చింతపల్లి గ్రామాల మధ్యన గల ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో దాదాపు 40 మోటార్లు ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. దీంతో గత నెలరోజుల నుంచి మాటిమాటికి కరెంట్ ట్రిప్ అవుతున్నది. తద్వార రైతుల కరెంట్ మోటార్లు కాలిపోవడం సర్వసాధారణంగా మారింది. నిత్యం ఇద్దరు, ముగ్గురు రైతుల మోటార్లు కాలిపోతున్నాయి. తిరిగి వైండింగ్ చేయించేందుకు గాను రైతులు ఖమ్మం నగరానికి తరలిస్తున్నారు. దీంతో ఒక్కో రైతుకు రూ.5 నుంచి రూ.6 వేల ఖర్చు అవుతున్నది. అదీకాక మూడు, నాలుగు రోజుల సమయం పడుతుండడంతో పంటలు ఎండిపోతున్నాయి. లోవోల్టేజి సమస్యలను అనేకసార్లు విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు.

### కరెంట్ కోతలు.. కర్షకుల ఇక్కట్లు

పూర్తిస్థాయిలో ఎండాకాలం రాకముందే ఖమ్మం రూరల్ మండలంలో కరెంట్ కోతలు ప్రారంభమయ్యాయి. యాసంగి పంటల సాగు ప్రారంభం నుంచి చింతపల్లి గ్రామంలో కరెంట్ కోతలు వేధిస్తున్నాయి. త్రీఫేస్ కరెంట్ రావాలంటే మధ్యాహ్నం ఒంటిగంట వరకు వేచిచూడాల్సిన పరిస్థితి. మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 6 గంటల వరకు మాత్రమే త్రీఫేస్ కరెంట్ సరఫరా అవుతున్నది. తిరిగి అర్ధరాత్రి ఒంటిగంట నుంచి తెల్లవారుజాము వరకు మాత్రమే ఉంటుంది. అయితే ఈ సమయాలు సైతం సరిగా పాటించడం లేదని రైతులు పేర్కొంటున్నారు. రాత్రిపూట కరెంట్ మోటార్ల వద్దకు వెళ్లలేని రైతులు మధ్యాహ్నం ఒంటి గంటకు ఒకేసారి అందరూ మోటార్లు ఆన్‌చేయడం.. దీంతో ట్రాన్స్‌ఫార్మర్‌పై లోడు పడుతుండడంతో నిత్యం మోటార్లు కాలిపోతున్నాయి. అయితే పదేండ్లపాటు నాటి బీఆర్‌ఎస్ సర్కార్ హయాంలో కరెంట్ కోతలు లేవని, కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చిన నాటినుంచి తిరిగి కరెంట్ కోతలు ప్రారంభమయ్యాయని రైతులు వాపోతున్నారు. వానకాలం వరదల కారణంగా పంటలు ఆగమయ్యాయని, తీరా యాసంగిలో కరెంట్ కష్టాలు వేధిస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయించి నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.



లో వోల్టేజి విద్యుత్ సరఫరా చేస్తున్న ట్రాన్స్‌ఫార్మర్

### మాటిమాటికీ మోటార్లు కాలిపోతున్నాయి..



పాటిమీద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌పై బాగా లోడు పడుతున్నది. దీంతో మాటిమాటికీ కరెంట్ మోటార్లు కాలిపోతున్నాయి. ప్రతిరోజు ఇద్దరి, ముగ్గురి మోటార్లు కాలిపోతున్నాయి. తిరిగి వైండింగ్ చేయించాలంటే ఖర్చుతోపాటు సమయం వృథా అవుతున్నది. ఈలోపు పంటలు ఎండిపోతున్నాయి. నిన్ననే మా మోటారు కాలిపోయింది. కరెంట్ సార్లకు ఎన్నిసార్లు చెప్పినా వినిపించుకోవడం లేదు. ఏడాది నుంచి ఇదే గోస పడుతున్నాం.

**– తోట నరేశ్, యువరైతు, చింతపల్లి, ఖమ్మం రూరల్**

### చేతికొచ్చిన పంటలు మాడిపోతున్నాయి..



ఈ సీజన్‌లో ఐదెకరాలు వరి, ఐదెకరాలు మక్కపంట సాగు చేశాను. నాలుగు రోజుల క్రితం మా మోటారు కాలిపోయింది. దీంతో పంటలకు నీరు అందక ఆగమైపోతున్నాయి. గతంలో భక్తరామదాసు ప్రాజెక్టు కాలువ కోసం మా విలువైన భూములు ఇచ్చాం. కనీసం కాలువ ద్వారా నీరు వదిలినా బాగుండేది. చెరువులో నీళ్లు అయిపోయాయి. ఇంకో ట్రాన్స్‌ఫార్మర్ వేయండి సారో అని ఎన్నిసార్లు కరెంటోళ్లకు చెప్పినా పట్టించుకోవడం లేదు.

**– టీ.చిన్నప్పయ్య, రైతు, చింతపల్లి, ఖమ్మం రూరల్**

### అధికారులు పట్టించుకోవడం లేదు..



మా పంట పొలాలు ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే ఉన్నాయి. లోవోల్టేజి ద్వారా మూడురోజుల క్రితం నా మోటారు కాలిపోయింది. తిరిగి బాగు చేయించుకొని వచ్చాను. కానీ స్విచ్ వేయాలంటే భయమేస్తున్నది. రెండు ఫేస్‌ల కరెంట్ మాత్రమే వస్తున్నది. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. మధ్యాహ్నం ఒంటిగంటకు త్రీఫేస్ కరెంట్ ఇస్తుండటంతో అందరూ ఒకేసారి మోటార్లు ఆన్ చేయడంతో లోడు పడుతున్నది. దీంతో మోటార్లు కాలిపోతున్నాయి. సమయానికి నీరు అందక మా ఆకుకూరలు నిలువునా ఎండిపోతున్నాయి. కరెంట్ సమస్య తీర్చండి మహాప్రభో.

**– మండల నాగేశ్వరరావు, రైతు, చింతపల్లి, ఖమ్మం రూరల్**